# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల అంతర్జాతీయ పర్యటనలో భాగంగా నిన్న పోలాండ్ రాజధాని వార్సా చేరుకున్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని ప్రకటించారు.**
3. **మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న రాష్ట్రాల్లో సమగ్ర అధ్యయనం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
4. **పర్యావరణ హిత పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
5. **భవిష్యత్ అవసరాలకు తగినట్లు ప్రాంతీయ బహ్యావలయ రహదారికి భూసేకరణ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.**
6. **దేశ వ్యాప్తంగా రేపు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించనున్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల అంతర్జాతీయ పర్యటనలో భాగంగా నిన్న పోలాండ్ రాజధాని వార్సా చేరుకున్నారు. వార్సా సైనిక విమానాశ్రయంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. వార్సాలోని స్థానిక హోటల్లో ప్రవాస భారతీయులు ప్రధానమంత్రికి సంప్రదాయ స్వాగతం పలికారు. మోంటే క్యాసినో యుద్ధ స్మారక చిహ్నం, జామ్‌సాహెబ్ నవనగర్, కొల్హాపూర్ స్మారకాలను ప్రధానమంత్రి సందర్శించి నివాళు లర్పించారు. ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఇరు దేశాల దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోలాండ్ పర్యటనకు వచ్చినట్లు నరేంద్రమోదీ తెలిపారు. ఈ అధికారిక పర్యటనలో నరేంద్రమోదీ, పోలాండ్ ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్, ఆ దేశపు అధ్యక్షుడు ఆండ్రెజ్ దుడాతో ఈ రోజు సమావేశమవుతారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సంస్థలో నిన్న మధ్యాహ్నం రియాక్టర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య 7కు చేరుకుంది. ఈ ఘటనలో కార్మికులు మృతి చెందడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న

కార్మికులు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయలు, గాయపడ్డ వారికి 50 వేల రూపాయల నష్ట పరిహారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

మరోవైపు... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో పర్యటిస్తారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలతోపాటు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి పరామర్శించనున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు.

-------------------------

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న రాష్ట్రాల్లో దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని, ఎటువంటి లోపాలకూ తావులేకుండా, మహిళలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా విధానాలను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ– ఏపీఎస్ఆర్టీసీ, రవాణాశాఖలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, పంజాబ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్న తీరు, అందులో లోటుపాట్లను పరిశీలించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కూడిన కమిటీ ఆయా రాష్ట్రాల్లో పరిశీలించి నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలు తగ్గించడంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. రహదారి భద్రతపై కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ హిత పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నంలో అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు, విశాఖ జిల్లాలకు చెందిన పర్యాటక శాఖాధికారులతో నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలోనూ పర్యటించి పర్యాటక రంగంలో ఉన్న సమస్యలను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆలయదర్శనం, ఆరోగ్య సంక్షేమం, పర్యావరణహిత పర్యాటక సర్క్యూట్లని ఏర్పాటు చేయనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

-------------------------

భవిష్యత్ అవసరాలకు తగినట్లు ప్రాంతీయ బహ్యవలయ రహదారి దక్షిణ భాగంలో ప్రతిపాదిత ప్రణాళికలో మార్పులు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ప్రాంతీయ బహ్యవలయ రహదారి పురోగతి పై ముఖ్యమంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావడం, సమస్యలు లేకుండా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భూసేకరణ, ఇతర విషయాలపై నివేదికలు అందజేయాలని తెలిపారు.

-------------------------

దేశ వ్యాప్తంగా రేపు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024ను జరుపుకుంటారు. చంద్రమండలాన్ని తాకుతూ జీవితాలను స్పృశించడం... భారత అంతరిక్ష గాథ అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని భారత మండపంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభోత్సవం చేస్తారు. ఈ సందర్భంగా అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఢిల్లీలో నిన్న పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... గత సంవత్సరం ఆగష్టు 23 న చంద్రయాన్– 3 యాత్ర విజయవంతంగా ముగిసిందని, విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సురక్షితంగా దిగిందని చెప్పారు. దీంతో మన దేశం చంద్రునిపై కాలు మోపిన నాల్గవ దేశమైందని, దక్షిణ ధృవం చేరిన తొలి దేశమైందని తెలిపారు. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వచ్చే పదేళ్ళలో ఐదు రెట్లు పెరిగి 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మంత్రి వివరించారు.

-----------------------------

తుంగభద్ర జలాశయంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన గేటు స్థానంలో తక్కువ సమయంలోనే స్టాప్ లాగ్ గేట్ అమర్చడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కన్నయ్యనాయుడు బృందం స్వల్ప వ్యవధిలోనే గేట్ అమర్చారని తెలిపారు. తద్వారా 40 టీఎంసీలు నీటిని వృథాగా పోకుండా అరికట్టగలిగామని చెప్పారు. కన్నయ్యనాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాజెక్టులని పరిశీలించి నివేదిక ఇవ్వనున్నారని ప్రాధాన్యం ప్రకారం ప్రాజెక్టుల్లో అవసరమైన మరమ్మత్తులు చేపడతామని మంత్రి తెలిపారు.

-----------------------------

తెలంగాణలో రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిన్న ఖమ్మంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలంగాణలో ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని, రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి గాలులు వీస్తున్నాయని వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే మూడు రోజులలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

మరోవైపు తెలంగాణలో  రాబోయే నాలుగు రోజుల పాటు   తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుజిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే హైదరాబాద్ నగరంలో కూడా ఈరోజు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

రహదారులు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ పట్ల ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో రహదారులు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ పరిస్థితులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,  గుంతలు పడిన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మురుగు నీటి వ్యవస్థల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసి పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

=======================